# పడమటి గుమ్మం

ఫోను రాగానే, బట్టలు మార్చుకొని బయలుదేరాను. ఫోను చేసినది నా మిత్రుడు, ఒకనాటి సహోద్యోగి రామారావు. "నిన్న తెల్లవారగానే పోయిందటరా, నీకు తెలుసా..? రామారావు ఫోనులో చెప్పాడు" నాకూ ఇప్పుడే తెలిసింది పోయినావిడ, అప్పన్న భార్య. అప్పన్న అంటే... ఉద్యోగం చేసిన రోజుల్లో, నా వద్ద పని చేసిన కలాసీలలో ఒకడు... అప్పన్న అంటే అంతేనా... స్కూటర్ స్టార్టు చేసాను. రోడ్డు మీదకు రాగానే ఉదయపు ఎండ వీపు మీద తగిలింది. ఎక్కడో దూరపుకొండలో పుట్టి, చాలా కాలం అక్కడే దాగి వుండి ఆ తరువాత మబ్బుల చేతివేళ్ళు పట్టుకొని ఎదిగి పైకొచ్చిన సూర్యుడు వెలిగిపోతున్నాడు!

రెండేళ్ళుగా అప్పన్నని చూడలేదు. నేను పదవీ విరమణ చేసిన కొత్తల్లో కూడా అప్పుడప్పుడు మా ఇంటికి వచ్చేవాడు అప్పన్న. ఈ మధ్య వాడూ స్వచ్ఛంద పదవీ విరమణ చేసాడట! పారిశ్రామికవాడలో, అప్పుడెప్పుడో కట్టుకున్న ఇంటిలో వున్నాడట! నా మిత్రుడు రామారావు చెప్పిన మాట ఇది.

"ఇప్పుడు అప్పన్న కనబడితే నువ్వు పోల్చుకోలేవురా" అప్పన్న గురించి అడిగి నప్పుడు, ఒకసారి, రామారావు అన్నాడు.

"అదేంటిరా..?"

"బాగా లావయ్యాడు. చేతిల్లో డబ్బులాడుతున్నట్టుంది. నాలుగువేళ్ళకి ఉంగరాలు – చేతికి బంగారు బ్రేసిలెట్టు – నల్లకళ్ళద్దాలు – పడవలాంటి కారు.."

నాకు ఆనందం కలిగింది. నాతో పాటు నా మిత్రులు కూడా ఆనందంగా వుండాలని కోరుకుంటూ వుంటాను నేను.

జ్ఞాపకాలని నెమరువేస్తూ... పరిగెత్తింది స్కూటర్.

నాతోనే పెరిగాడు, అప్పన్న. మా ఇంటిలోనే చిన్నాచితకా పనులు చేస్తూ వుండేవాడు, వాడి తండ్రి. స్కూలులో చదివినప్పుడు, నా పుస్తకాల సంచి మోసేవాడు అప్పన్న. మధ్యాహ్న భోజనం తెచ్చేవాడు. బడి నుంచి ఇంటికి వెళ్ళేటప్పుడు చేలనుంచి శెనక్కాయల మొక్కలు పీకి, పచ్చి శెనక్కాయలు కడిగి తినమని ఇచ్చేవాడు. కాని, బడిలో చేరమని చదువుకోమని నేనూ మా నాన్న ఎంత పోరినా, వాడూ, వాడి తండ్రి ఒప్పుకునే వారు కాదు.

"మాకెందుకు దొరా, ఈ సదువులు...? మీ కాళ్ళకింద పడి వుండవలసినోళ్ళం... మీ దయ వుండాలి కాని..."

చూస్తూ వుండగానే, ఊరిలోని కాలిబాటలు రోడ్డులుగా మారాయి. డబ్బు మోస్తూ కార్లు, స్కూటర్‌లు రోడ్డు మీద పరుగులు తీసాయి. గుడిసెలు మేడలుగా వేషం మార్చుకున్నాయి. నేనూ, అప్పన్న ఎదిగాము. బాగా చదివి ఉద్యోగంలో చేరాను, నేను.

"మన్నించండి దొర..." ఒకసారి సెలవుల్లో వెళ్ళినప్పుడు అప్పన్న తండ్రి అన్నాడు "తమ దయవుండాలి... మా వాడికి ఏదైనా ఉద్యోగం..."

అతన్ని ఆశ్చర్యంగా చూసాను.

"అవును దొర... ఊరిలో ఇప్పుడు పనులు ఏమున్నాయి? పాడిపంటలు లేవుగా... తమ పొలాలు కూడా..."

నిజమే! మా పొలాలు ఎప్పుడో పోయాయి. పసుపు కుంకుమలు పొగొట్టుకున్న ఆడదానిలా వుంది పాడిపంటలు లేని ఊరు!

"చూస్తానులే.." అన్నాను. "అయినా, అప్పన్నకి బొత్తిగా చదువురాదు. పట్నంలో ఏం చేస్తాడు?"

మేనేజర్‌గారిని బతిమాలి, మా కర్మాగారంలో కలాసి పని ఇప్పించాను. అప్పన్నకి. కష్టమైన పనినే – సిమెంటు బస్తాలు మోసే పని!

బాగా పని చేసేవాడు, అప్పన్న. ఏదైనా సమస్య వచ్చినప్పుడు, నా వద్దకి వచ్చేవాడు.

"ఇల్లు దొరకటంలేదు దొర" వాడికి పెళ్ళైన కొత్తలో ఒకసారి నా వద్దకు వచ్చి గొణిగాడు. కర్మాగారంలో పనిచేసే కలాసీలతో మాట్లాడి వాడికి ఉండటానికి ఇల్లు ఏర్పాటు చేసాను.

అప్పన్న కష్టపడి పని చేసేవాడు. ఎంత పని చెప్పినా విసుక్కునేవాడు కాదు. అవసరం వచ్చినప్పుడు గొణుక్కోకుండా, ఎక్కువసేపు పనిచేసేవాడు. తోటి కార్మికులు టైముకి వెళ్ళిపోయినా, వెళ్ళమని చెప్పేంత వరకు ఇంటికి వెళ్ళేవాడు కాదు. పని ముగించుకొని ఇంటికెళ్తే, వేరెక్కడకీ కదిలేవాడు కాదు. ఇల్లు, కర్మాగారం తప్ప వేరే ప్రపంచముండేది

కాదు, అప్పన్నకి.

"ఆపండి ఆపండి" అనే కేకలు విని హఠాత్తుగా బ్రేకు వేసాను. ఆగివున్న బస్సుని రాసుకుంటూ, ఆగింది, స్కూటర్. రోడ్డు కూడలిలో ఆగివుంది, బస్సు – బస్సులో చిలకల్లా 'కిలకిలా' పలికే బడి పిల్లలు –

తన కొడుకుని స్కూలులో చేర్చటం కోసం అప్పన్న పడిన పాట్లు గుర్తుకొచ్చాయి. నాకు.

కొడుకుని ఇంగ్లీషు మీడియం స్కూలులో చదివించాలనేది, అప్పన్న కోరిక. కాని అస్సలు ఇంగ్లీషు రాని వారి పిల్లలకి సీటు ఇవ్వనన్నారట, స్కూల్‌వారు.

"వారికి మీరే చెప్పాలి దొర" చీకటిపడే వేళకి వచ్చాడు అప్పన్న.

"రా లోపలికి రా... ఏ స్కూలు..?" నేను అడిగాను.

"మాట్లాడుదాం"

అప్పన్న లోపలకి వచ్చాడు. మెలమెల్లగా, ఇంటిలోకి దూరే చీకటిని తొలగించ టానికి లైటు వేసాను. లైటు వెలిగింది. అప్పన్న కొడుక్కి సంరక్షకుడిగా మారాను.

బస్సు కదిలింది – నా స్కూటర్ కూడా.

మా కర్మాగారంలోని యంత్రాలు నిర్విరామంగా తిరిగాయి. కొన్ని తిరిగి తిరిగి అరిగిపోయాయి. వాటి స్థానంలో కొత్త యంత్రాలు వచ్చాయి.

"మావాడు కంప్యూటర్ చదవాలని అంటున్నాడు, దొర" అప్పన్న మళ్ళీ వచ్చాడు.

"చదవనీ... మంచిదేగా..."

"మంచిదే. కాని చదవాలంటే మార్కులు రావొద్దు...?"

"మరి...?"

"వాడు అదే చదువుతాడట. మొండికేస్తున్నాడు. అందుకే..." అప్పన్న ఒక నిమిషం ఆగాడు. ఆ తరువాత అన్నాడు. "మార్కులు తక్కువ వచ్చినా, కాలేజీ వారికి సీట్లు వుంటాయట కదండి. డొనేషన్ కట్టినా... ఎవరైనా..."

"డబ్బు కావాలా..."

"ఒద్దు దొర, మీ మాట చాలు. కాలేజి వారికి మీరు కావలిసిన వారట కదా. మీరు ఒక మాట చెప్తే..."

ఒక నిమిషం ఆలోచించాను. అప్పన్నని వెంటబెట్టుకొని వెళ్ళాను. కర్మాగారంలో ఉన్నతాధికారి అయిన నాకు వున్న పరపతి ఆ రోజే తెలుసుకున్నాను.

కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో చేరిన అప్పన్న కొడుకు పొగ మంచుని చీల్చుకొచ్చిన సూర్యుడిలా వెలిగాడు. చదువు పూర్తి చేసి అమెరికా వెళ్ళిపోయాడు.

అడ్డు వచ్చిన నాలుగేళ్ళ పాపని తప్పించటం కోసం హఠాత్తుగా స్కూటర్‌కి బ్రేకు వేసాను. స్కూటర్ ఆగింది. కంగారుగా అటు ఇటూ చూసాను. అప్పన్న ఇంటి ముందుంది, స్కూటర్.

స్కూటర్ దిగి గేటు తీసి లోపలకు వెళ్ళాను. గేటుకి, ఇంటికి మధ్య వేసిన షామియానా కింద అడ్డదిడ్డంగా పడివున్న కుర్చీలనీ, ఖాళీ ప్లాస్టిక్ టీ కప్పులని దాటి ఇంటి లోపలకు చేరాను. హాలులో నేల మీద కనబడింది, శవం.

హాలులో ఎవరూ కనబడలేదు. ఇంటి లోపల ఎవరెవరో మాట్లాడే గోల వినబడింది.

అప్పన్న గురించి అటు ఇటూ చూస్తూ వుండగా ముఖానికి తగిలింది చల్లని గాలి. కంగారుగా చూసాను. హాలుని ఆనుకుని వుండే గది తలుపు తెరుచుకుని ఎదురుగా వచ్చింది ఒకావిడ. ఆవిడ చేతుల్లో ఒక ట్రే- ట్రేలో ఖాళీ కప్పులు- టిఫిన్ ప్లేట్లు- గది లోపల గట్టిగా మాటలు- సినిమాల గురించి, టి.వి. సీరియల్స్ గురించి.

నా మనస్సు చివుక్కుమంది. మా చిన్నప్పుడు ఊరులో ఎవరింటిలోనైనా శవం ఉంటే, శవ దహనం అయినంత వరకు ఎవరూ ఏది తినేవారు కాదనే సంగతి మనస్సులో మెదిలింది.

"మీకెలా తెలిసింది...?" అప్పన్న మాట విని తిరిగి చూసాను.

"రామారావు చెప్పాడు... ఏమైంది రా...?"

"ఒంట్లో బాగోలేదంటే, హాస్పిటల్‌లో చేర్చాను. రాత్రికి రాత్రి అయిదు లక్షలు ఖర్చుచేసాను. గొప్ప గొప్ప డాక్టర్ల రప్పించాను. పెద్ద హాస్పిటల్‌లోనే చేర్చాను. ఖర్చు గురించి వెనకాడవొద్దని చెప్పాను... డాలర్‌లు వస్తున్నాయి కదా..."

"ఏ హాస్పిటల్...?"

హాస్పిటల్ పేరు చెప్పాడు అప్పన్న. ధనవంతులు మాత్రం వెళ్ళగలిగే హాస్పిటలే!

"మా ఇంటాడది పోయిందని తెలిసి, ఈ నియోజకవర్గం ఎమ్మెల్యే గారొచ్చి, చూసి వెళ్ళారు! మంత్రిగారు రాబోతున్నారు" చెప్పాడు అప్పన్న.

నేను ఆశ్చర్యంతో చిత్తయిపోయాను. రెండేళ్ళ క్రితం వరకు, నూతిలో కప్పలా బతికిన అప్పన్నకి ఈ పరిచయాలేమిటి? ఈ మాటలు నిజమా...?

అప్పన్నని ఓదార్చాలని, వార్త వినగానే పరిగెత్తుకొచ్చాను. కాని ఓదార్చవలసిన అవసరం కనబడలేదు నాకు.

"మిగతా కార్యక్రమాలు...?"

"మంత్రిగారి గురించి చూస్తున్నానండి. ఆయనొస్తే మొదలెడతాం"

"మరి మీవాడు...?"

"రేపు వస్తాడుట. అయినా వాడి గురించి చూడటం లేదండి. మంత్రిగారు వస్తే..."

భార్య మరణాన్ని కూడా తన పరపతి ప్రదర్శించే సందర్భంగా మార్చిన అప్పన్నని చూస్తూ వుంటే నాకు అసహ్యం వేసింది. అక్కడ నిలబడాలని అనిపించలేదు. గబగబా రోడ్డు మీదకు వచ్చాను.

అప్పుడు గమనించాను. అప్పన్న తన ఇంటికి మరమ్మత్తు చేసి కొత్తరూపు తెచ్చాడని ఇప్పుడు అతని ఇంటి తలుపులు పడమటి వైపు తెరిచి వున్నాయని.

***